క్లుప్తంగా

నేడు తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని మొల్లమాంబ సమావేశ మందిరంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

పిల్లలను బాగా చదివించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ షరీఫ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : పిల్లలను బాగా చదివించాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ సూచించారు. సోమవారం 48వ డివిజన్ బుడగజంగం కాలనీలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో బుడగజంగాల మహిళలు చెత్త కాగితాల ఏరివేత పేరుతో నగర వీధుల్లో సంచరిస్తున్నారని, అర్ధరాత్రి సమయంలో చెత్త కాగితాల పేరుతో బయట తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తగిన చర్యలు చేపట్టాల్సి వస్తుందన్నారు. పిల్లలను బిక్షాటనకు పంపించకుండా బడికి పంపాలన్నారు. ఇకనైన చట్టప్రకారం నడుస్తూ దొంగతనాలు మాని జీవితాన్ని మార్చుకోవాలన్నారు. అలాగే పిల్లలకు చిన్న వయస్సుల్లోనే వివాహాలు చేయకుండా వారిని బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు ప్రసాద్ తెలిపారు. సోమవారం ప్రముఖ న్యాయవాది అజయ్‌కుమార్ వీణా జయంతిని పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అలాగే నగరంలో పలు సేవా కార్య క్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజయ్ యువ సేన నాయకులు వీణా సాయి కౌశిక్, బ్లడ్ టూ లీవ్ ప్రతినిధి పవన్‌కుమార్, వెంకటేశ్వర హైస్కూలు యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌తోపాటు ఇతర ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాత రిమ్స్ లో ఉన్న జిల్లా కార్మిక ఉప కమిషనర్ కార్యాలయం దగ్గర భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలోను ప్రభుత్వ స్కీము పథకాలతో పాటు, కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు ఐదు వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కెసీ బాదుల్లా, మద్దిలేటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించాలి

చింతకొమ్మదిన్నె: విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడానికి డిప్లొమా కోర్సు చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీ మోహన్ నాయక్, కె.యస్.శశి కుమార్, శ్రీ చందన, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్యసిరినందించే వేలాంగిణి మాత

– నేటి నుంచి నవదిన ఉత్సవాలు

కడప కల్చరల్ : ఆ ప్రశాంతమైన వాతావరణంలోకి అడుగు పెట్టగానే మనసు ఎంతో తేలికపడుతుంది. బాధలన్నీ మాయమైనట్లు అనిపిస్తుంది. నిజమే ఆ ప్రాంగణంలో అడుగు పెడితే ఆరోగ్యాన్ని అందించే ఆ తల్లి ఒడిలో స్వాంతన పొందినట్లే! ఆమె పేరు ఆరోగ్యమాత. కడప నగరంలో ఆమె పేరిట ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఏర్పడింది.

కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల కడప వేలాంగణి ఆరోగ్యమాత ఉత్సవాలను మంగళవారం నుంచి సెప్టెంబరు 8వ తేది వరకు నిర్వహించనున్నారు. కడపజిల్లాలో క్రైస్తవం విస్తరించిన అనంతరం క్రిస్టియన్‌లేన్, రైల్వేస్టేషన్, మరియాపురం ప్రాంతాలలో క్రైస్తవ సంస్థలు ఆవిర్భవించాయి. ప్రస్తుతం ఆరోగ్యమాత చర్చి ఉన్న ప్రాంతం ఒకప్పుడు పెద్ద గోతులు, ముళ్ల కంపలతో నిండి ఉండేది. బళ్లారి, గుత్తి ప్రాంతాలలో క్రైస్తవ బోధనలు చేస్తున్న గురువులు ఈ ప్రాంతానికి వచ్చి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని ప్రస్తుతం చర్చి ఉన్న స్థలంలో చిన్న కొట్టాన్ని నిర్మించి, అందులో ప్రార్థనలు చేసేవారు. తర్వాత ఆ స్థలాన్ని అభివృద్ధి చేసి చిన్న మందిరాన్ని నిర్మించారు. విశ్వాసుల సంఖ్య క్రమంగా పెరగడంతో దాని స్థానంలో చర్చిని నిర్మించారు.

1977 ప్రాంతంలో నాటి కడప పీఠాధిపతులు ఎస్ఏ అరుళయ్య ఆరోగ్యమాత పుణ్యక్షేత్రాన్ని పూర్తి స్థాయిలో తీర్చిదిద్దారు. పాత చర్చితోపాటు మరో చర్చి నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది.

2007లో నాటి గురువులు ఫాదర్ సగిలి ప్రకాశ్ నూతన చర్చి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. 2009లో కొత్త చర్చి పూర్తయింది. మోస్ట్ రెవెరెండ్ ×ఫెద్రో లోపేజ్ క్వింటానా‡ చర్చిని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ చర్చికి డైరెక్టర్‌గా ఎండీ ఎండీ ప్రసాద్, సహాయ డైరెక్టర్ విల్సన్ సేవలు అందిస్తున్నారు. యేటా ఈ క్షేత్రంలో ఆరోగ్యమాత పేరిట తిరునాల నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం నుంచి నవదిన ఉత్సవాలను సాయంత్రం 5 గంటలకు అదిలాబాద్‌కు చెందిన రెవరెండ్ డాక్టర్ బిషప్ ప్రిన్స్ అంథోని దివ్య బలిపూజ అనంతరం పతాకావిష్కరణ చేసి ప్రారంభిస్తారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 నుంచి 8.00 గంటల వరకు ప్రముఖ



కడప నగరంలోని ఆరోగ్యమాత చర్చి

మత గురువులు ఆధ్యాత్మిక అంశాలపైన ఆరోగ్యమాత గురించి ప్రసంగించనున్నారు. సెప్టెంబరు 8న ఆ దివ్యమాత జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా..48/1వ డివిజన్ రామరాజుపల్లి, సచివాలయం-1 లోని చౌటపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. జగనన్న ప్రభుత్వంలో తమకు



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

లబ్ధి చేకూరిందని పలువురు సంతృప్తి వ్యక్తం చేయగా.. మరికొందరు తమ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశించారు. చాగల సుమిత్ర అనే మహిళ తనకు వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదుల ద్వారా రూ.9,24,049 లబ్ధి చేకూరిందని ఆ నందం వ్యక్తం చేసింది. ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం లో మాకు అందలేదని ఇలాంటి ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీ మ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, నాయకులు జయచంద్రారెడ్డి, పాకా సురే ష్, శివారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, తోట క్రిష్ణ, మియ్యా, మున్నా, పవర్ అల్తాఫ్, షఫీ, బాల స్వా మి రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, పస్తం అంజి, వేణుగోపాల్ నాయక్, మునిశేఖర్‌రెడ్డి, జఫ్రుల్లా, పత్తి రాజేశ్వరి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న గృహాలకు తప్పనిసరిగా ప్లాన్ అప్రూవల్ ఉండేలా చూడాలని, ఆక్రమణలు ఎక్కడా లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. నగరంలో ఏర్పాటు చేయు బ్యానర్లు, ఫ్లెక్సీలకు తప్పనిసరిగా చలానా కట్టించుకోవాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరిగేలా చూడాలన్నారు. స్పందనలో మొత్తం 45 అర్జీలుగా రాగా ఇంజినీరింగ్ విభాగం -12, టౌన్‌ప్లానింగ్- 11, రెవెన్యూ-5, యూపీఏ విభాగం-1, మెప్మా-2, సచివాలయాలు-5, డీఎం అండ్‌హెచ్‌ఓ-1, కడప తహసీల్దార్-2, హౌసింగ్-3 అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, మేనేజర్ హిదాయతుల్లా, ఎస్‌ఈ రత్నాల రాజు, ఇన్‌చార్జి ఈఈ కరిముల్లాఖాన్, డీఈలు, ఏఈలు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.



'స్పందన' కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

అమ్మ భాషలో ఆత్మీయత ఉంటుంది

కడప కల్చరల్ : అమ్మ భాషలో ఎంతో ఆత్మీయత లభిస్తుందని తెలుగు అధ్యాపకులు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి అన్నారు. సోమవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించారు. బ్రౌన్‌కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానవక్త పెద్దిరెడ్డి నీలవేణి మాట్లాడుతూ కృత్రిమ ఆంగ్ల సంస్కృతితో ప్రేమానురాగాలు దూరవుతున్నాయని, అమ్మ, నాన్న అన్నప్పుడే మాధుర్యం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె గిడుగు రామ్మూర్తి పంతుల జీవిత విశేషాలను తెలిపారు. వైవీయూ లలిత కళల విభాగం సంగీత అధ్యాపకుడు సుబ్బరాయుడు వేమన పద్యాలను వినిపించారు. ఐఐఐటి తెలుగు శాఖ సహాయాచార్యులు డాక్టర్ పవన్ కుమార్ పౌరాణిక నాటకాల్లోని పద్యాలను ఆలపించారు. ప్రముఖ కర్రసాము అధ్యాపకులు జయచంద్ర పర్యవేణలో దీక్షిత, శ్వేతాంజలి కత్తి యుద్ధం, కర్రసాము ప్రదర్శించారు. స్థానిక పాఠశాల విద్యా ర్థి శ్రీరాం సంతోష్ ప్రాచీన, ఆధునిక సాహిత్య వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, విద్యార్థులు పాల్గొన్నారు.



వక్త నీలవేణిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

'బ్రౌన్' చిత్రంతో 'మైనంపాటి'కి చిరకీర్తి

కడప కల్చరల్ : తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్‌కు తన కుంచెతో రూపం కల్పించిన మైనంపాటి సుబ్రమణ్యంకు ఆ చిత్రం తరగని కీర్తిని అందించిందని యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సీపీ బ్రౌన్ ఊహాచిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం 101వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులతో కలసి



మైనంపాటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

మైనంపాటి వెంకట సుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జానమద్ది బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణ సమయంలో మైనంపాటిని కలిసి బ్రౌన్ చిత్రం రూపకల్పన గురించి చర్చించడం, చిత్రం గీసే బాధ్యతను అప్పగించడం, దాన్ని మైనంపాటి తపస్సులా తీసుకుని బ్రౌన్ ఊహా చిత్రాన్ని గీసి ఇవ్వడం తదితర అంశాలను గుర్తు చేసుకున్నారు. ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ మైనంపాటి బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మైనంపాటి రచనలన్నీ అచ్చులోకి తేవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, అలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాకారం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి పేర్కొన్నారు. మండలంలోని వేల్పుల గ్రామంలో సోమవారం సచివాలయ సముదాయ ప్రథమ వార్షికోత్సవాలను ప్రారంభించి జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సచివాలయాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేల్పులలోని సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి 4లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామాల్లో వలంటీర్ల సేవలు అద్భుతంగా ఉన్నాయని, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, ఎంపీటీసీ బాబ్‌జాన్, సర్పంచ్ నిర్మల, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి

క్రీడాసంబరాలతో పండుగ వాతావరణం

సచివాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఆటల పోటీలతో పండుగ వాతావరణం నెలకొంది. పులివెందుల ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వైఎస్ మధురెడ్డిలు టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

భాషాభివృద్ధికి ప్రభుత్వం కృషి

కడప కల్చరల్: రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య స్పష్టం చేశారు. ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు కేవలం బురద జల్లేందుకేనని ఆయన అన్నారు. తెలుగు భాషపై అవగాహన లేనివారు ప్రభుత్వంపై పసలేని విమర్శలు చేస్తున్నారన్నారని, వీటిలో నిజం లేదన్నారు. విద్యార్థులకు ద్విభాష పుస్తకాల ద్వారా తెలుగుతో పాటు ఆంగ్లం సులభంగా అర్థమవుతుందన్నారు.

గంగమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు



చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్త పేట సమీపంలోని గంగమ్మ తల్లి దేవస్థానానికి సంబంధించి హుండీ లెక్కింపు నిర్వహించారు. సోమవారం ఆలయ ఆవరణంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా 40 రోజులకు లక్షా ఆరువేల 582 రూపాయాల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ పి. సురేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళి సమేతుడు



పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి సోమవారం పల్లకీలో ఊరేగారు. ప్రతి సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. పల్లకీ సేవలో ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలం రెడ్డి విజయ, ఆలయ ఈఓ డివిరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

వీరపునాయునిపల్లె: మండలంలోని రైతులకు ఆధునిక వ్యవసాయంపై మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి కల్యాణి తెలిపారు. ఈ శిక్షణా తరగతులు మంగళవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిత్ర హాస్పిటల్ ప్రారంభం



పూజ చేస్తున్న మిత్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డా. చంద్రమోహన్‌రెడ్డి, డా. మాధవి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లె ద్వారకా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ×మిత్ర హాస్పిటల్ ప్రారంభమైంది. ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డా. చంద్రమోహన్‌రెడ్డి తల్లిదండ్రులు లక్ష్మీదేవి, సంజీవరెడ్డిలు పూజా కార్యక్రమాలు నిర్వహించి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. చంద్రమోహన్‌రెడ్డి, డా. పి. మాధవి మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో అన్ని రకాల చికిత్సలను ఈ హాస్పిటల్ ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. కడుపు నొప్పి, పిత్తాశయంలో రాళ్లు, పుండ్లు, గాయాలు, జ్వరము, తలనొప్పి, చర్మ వ్యాధులు, సాధారణ వ్యాధులన్నింటికీ శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. అలాగే దంత వైద్యానికి సంబంధించి వంకర పళ్లు, పిప్పి పళ్లు, ఎత్తు పళ్లు, రూట్‌కెనాల్ పళ్లకు అన్ని రకాల చికిత్సలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శేషయనారెడ్డి, ఓబుల్ రెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ సమేత సోమసుందరేశ్వర స్వామి ఆలయంలోని హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ అర్చకులు బ్రాహ్మణపల్లె చంద్రమౌశీశ్వరశర్మ, స్థానిక ప్రముఖులు ఎస్వీ సుబ్బారెడ్డి, దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్‌ల పర్యవేక్షణలో హుండీ సొమ్ము లెక్కించారు. ఇందులో ఐదు నెలల 20 రోజులకుగాను రూ. 30,782 లభించిందని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ



విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారికి నివాళి అర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో 2000 సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ పోరాటాలు చేస్తూ అమరులైన వారికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న ప్రపంచ బ్యాంకు సంస్కరణలను వ్యతిరేకిస్తూ, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ హైదరాబాదులోని బషీర్‌బాగ్‌లో ప్రజలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ఆనాటి ప్రభుత్వం ప్రజలపై పోలీసులతో భాష్పవాయువు ఉపయోగించి లాఠీలతో కొట్టి కాల్పులు జరిపడంతో వామపక్ష కార్యకర్తలైన రామకృష్ణ, విష్ణు వర్ధన్ రెడ్డి మరణించారన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు వెంకట శివ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

ఒంటిమిట్ట: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఉన్న వ్యవసాయ బోరు మెకానిక్ అంగడిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. ఒంటిమిట్టలో శేఖర్ బోరు మెకానిక్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి, పైన ఉన్న రేకులను తొలగించి దుకాణంలో కొంతమంది దుండగులు లోనికి చొరబడి అక్కడ ఉన్న రూ. 3 లక్షల నగదును చోరీ చేసినట్లు యజమాని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును అందుకున్న ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు విచారణ చేపట్టారు.

నేడు నందిమండలంలో గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి: మండలంలోని నందిమండలం గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డిలు పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల్లోని వరి పంట పొలాలను సోమవారం ఊటుకూరు శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్‌కుమార్ (కీటక నిపుణులు), డాక్టర్ జాన్సన్ (తెగుళ్ల నిపుణులు), డాక్టర్ శ్రీవల్లి (బ్రీడర్), బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ, స్థానిక మండల వ్యవసాయాధికారి రమేష్ రెడ్డిలు పంటలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఊటుకూరు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంట పిలకలు, కరుకు దశలో ఉందన్నారు. బిపిటి 5204, కెఎన్‌ఎం-1638 రకాలు సాగు చేశారన్నారు. వరి పంటలో ఆకునల్లి ఉధృతి ఎక్కువగా ఉందని, దీంతో పత్రహరితం తక్కువై ఆకులు ఎర్రగా మారుతున్నాయన్నారు. దీని నివారణ కోసం ప్రొఫైనోఫోస్ 2 మిల్లీలీటర్లు, ఒక లీటరు నీటికి లేదా ఓమైట్ ప్రోపరగైట్ 2 మిల్లీ లీటర్లు లేదా ఒబెరాన్ 1 మిల్లీ లీటరుకు 1 లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇంకా పలు రకాల సూచనలు అందజేశారు. అనంతరం ఆర్బీకేల్లో యూరియా ఎరువులు నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు మేకల ప్రేమ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఊటుకూరు శాస్త్రవేత్తలు